**జరిగిన కథ :** ఏడుగురు మిత్రుల కథ ఇది. వారిలో ఐదోవాడైన కుచుమారుడి గురించి ఇప్పుడు చెప్పుకొంటున్నాం. అతను ధారానగరానికి వస్తూ అడవిలో దారి తప్పాడు. మరణించిన ఒక సిద్ధ యోగి అస్థిమాలను ధరించి.. అష్టసిద్ధులను పొందాడు. పురందరపురం యువరాణి సరస్వతిని వాదంలో ఓడించి, ఆమె రాజ్యాన్ని కైవసం చేసుకోవాలని ప్రయత్నం చేస్తున్నాడు.






# శంబరుడి కుతంత్రం

అనుసృజన:
**నేతి సూర్యనారాయణ శర్మ**

రెండు పరీక్షలు నెగ్గిన తరువాత కుచుమారునికి మరో అసలైన పరీక్ష పెట్టింది సరస్వతి. తన వద్దనున్న మొద్దు చిలుకను అతని వద్దకు పంపి, దానిచేత మాట్లాడించమని చెప్పింది. కుచుమారుడు ఆ చిలుకను అందుకుని ముద్దుపెట్టుకుంటూ..

''ఓసి చిలుకా! నీకు సరస్వతి ఏయే విద్యలు నేర్పింది? మీ రాజపుత్రిక సందేశమేమిటో చెప్పు!'' అని అడిగాడు.

కానీ, ఆ చిలుక పలకలేదు.

అప్పుడు దానిని తీసుకొచ్చిన దాది..

''అయ్యా! ఈ చిలుకను మా సరస్వతి విదేశాల నుంచి తీసుకొచ్చింది. ఎంత ప్రయత్నించినా దీనికి మాటలు రాలేదు. కనుకనే దీనికి మాటలు నేర్పమని కోరుతున్నది'' అని చెప్పింది.

''సరే అయితే.. దీనిని రేపు పంపిస్తాను. నువ్వెళ్లు'' అని సెలవిచ్చి పంపాడు కుచుమారుడు.

ఆ రాత్రికి ఎవరూ లేని సమయంలో తన మెడలోని సిద్ధుని ఎముకల మాలను చిలుకకు తగిలించాడు.

''ఓసీ చిలుకా! సర్వవిద్యలూ ఎరిగిన ప్రౌఢవయ్యావు. ఇక మాట్లాడవే!'' అన్నాడు.

మరు నిమిషంలో సర్వగ్రాహిణీ యంత్రంలా చిలుకకు విద్యలు వచ్చేశాయి. ఆశుకవిత్వం సైతం చెప్పసాగింది. సంతృప్తి పడిన కుచుమారుడు తన అస్థిమాలను వెనక్కు తీసుకున్నాడు.

మరునాడు దాది వచ్చి, చిలుకను తీసుకుపోయింది.

''ఏమే మొద్దు చిలుకా! సుద్దులేమైనా నేర్చుకున్నావా?'' అని అడిగింది సరస్వతి.

''నేను మొద్దు చిలుకనో, ముద్దు చిలుకనో ఇకమీదట చూస్తావు. నేను కుచుమారుని శిష్యుడినయ్యాను. నన్ను ఏ విద్యలలోనైనా పరీక్షించుకో!'' అన్నది చిలుక.

ఆ మాటలకు నిశ్చేష్టురాలై..

''సరే అయితే.. చతుష్షష్టి కళల పేర్లు చెప్పు?'' అన్నది సరస్వతి.

''కుచుమారుని శిష్యుణ్ని అడగాల్సిన ప్రశ్నేనా ఇది?! ఇంత చిన్న ప్రశ్నకు నేనెందుకు?'' అంటూ.. వరుసగా అరవైనాలుగు కళల పేర్లు చెప్పి..

''కావాలంటే.. నన్ను ఏ విద్యలో అయినా పరీక్షించుకో!'' అని సవాల్ విసిరింది చిలుక.

దాని మాటలకు సరస్వతికి భలే సరదా వేసింది. అబ్బురపడుతూ..

''అన్ని విద్యలు నేర్చినావుటే.. ఏదీ ఇది చెప్పు చూద్దాం!'' అంటూ.. వరుసగా ఆరు శాస్త్రాలలో వివిధ ప్రశ్నలు వేసింది.

అన్నిటికీ చిలుక తెలివిగా సమాధానం చెప్పింది.

వాటిని విన్న తరువాత సంబరపడి పోయిన సరస్వతి తన దాసి అయిన సారసికతో..

''ఈ చిలుక పలుకులు వింటుంటేనే ఆ కుచుమారుడు ఎంతటివాడో అర్థమవుతున్నది. నేను అతణ్ని వరించాను'' అన్నది.

''అదేమిటమ్మా! అతని రూపం, యవ్వనం, ధనం వంటివన్నీ చూడకుండా ఎలా?'' అన్నది దాది.

''నువ్వు ఆయన్ను చూడలేదా? అందగాడు కాదా?! కాకపోయినా సరే.. ఇంతటి పండితుణ్ని వరించకపోతే నా చదువు, జన్మ వ్యర్థమవుతాయి'' అన్నది సరస్వతి.

''నేను ఆయన్ను సరిగా చూడలేదమ్మా! పోనీ.. రేపో సారి వెళ్లి రమ్మంటారా?'' అని అడిగింది దాది.

''అవసరం లేదు. నలదమయంతులకు మధ్య హంసలా.. ఈ చిలుకే ఇకనుంచి మా మధ్య రాయబారం నడపగలదు'' అన్నది సరస్వతి.

తన మెడలోని ముత్యాలపేరును చిలుక నోటికి అందించింది. హంస తామరతూడును కరచి పట్టుకున్నట్టు ఆ ముత్యాలహారాన్ని ముక్కున పెట్టుకుని చిలుక ఎగిరింది. కుచుమారుని విడిదిలో అతని ముందు వాలింది. అతని ఎదుట హారాన్ని ఉంచి.. సరస్వతి పంపించిన సందేశాన్ని వినిపించింది. అతను ముత్యాల హారాన్ని తన మెడలో వేసుకున్నాడు.

''నేను ఆమె ఇచ్చిన హారాన్ని గుండెలమీద పెట్టుకున్నానని చెప్పు'' అని సరస్వతికి తన తిరుగు సందేశం పంపించాడు. అలా వారిమధ్య కొంతకాలం చిలుక రాయబారం నడిచింది.

ఒకనాడు తనతో వచ్చిన శంబరునితో..

''ఓరీ! రాజ్యలక్ష్మితోపాటుగా త్వరలో సరస్వతి నా పరం కానున్నది'' అని చెప్పాడు కుచుమారుడు.

అప్పుడు శంబరుడు..

''అయ్యా! ఇదంతా మా తండ్రిగారి ఉపదేశం వల్లనే కదా! రాజ్యం వచ్చిన తరువాత మీకు మా మీద దయ ఉంటుందో లేదో..'' అని నసిగాడు.

అందుకు కుచుమారుడు నవ్వుతూ..